# అభాగిని

రచన:
శ్రీ శివశంకర్.

డాక్టరుగారు! రాత్రినుండీ మా అమ్మకు జ్వరం తీవ్రంగా ఉందండి, రాత్రంతా తెలివిలేదు. ఏదేదో అంటూనే ఉంది. తెల్లవారేక ఒక వాంతి చేసింది. నాకేదో భయంగా ఉంది. రండిబాబూ! మీకు పుణ్యం ఉంటుంది. మీ బిడ్డాపాపలకు క్షేమం. మీ వాళ్ళందరకు యోగదాయకం. రండిబాబూ! ఆ దీనురాలు ఉండి ఉండి కళ్ళు తేర వేసర్తాఉంది. రండి డాక్టరుగారూ! డాక్టరుగారూ!! డా...క్ట...ర్!!! అంటూ 'వసంత' ఘోరంగా డాక్టర్ 'సుందర్' యింటి ముందు నిలబడి గోలపెడుతూ ఉంది. కానీ 'డాక్టర్ సుందర్' నిన్నరాత్రి తన తల్లికి తొందర అని తెలియగానే ఆ గ్రామంలో ప్రయాణసౌకర్యాలు లేకపోగా ఒక రెండెడ్ల బండిని కట్టించుకుని పట్టణానికి వెళ్ళినట్టు 'వసంత' కు తెలియదు. ఆ కంగారు, కన్నతల్లిపై ఉన్న మమకారం ఆక్షణాన తెలియనీయదు.

'డాక్టర్!' మా అమ్మ మీ క్రింద ఎంతో సేవచేసింది. మీకు కష్టం కలిగితే మా అమ్మ కంటికి నిద్రలేకుండా మిమ్మల్ని కాపాడేది. మీ పోషణలో మా అమ్మకు, నాకూ సుఖశాంతులు లేకపోయినా మావల్ల మీరు మన శ్శాంతి పొందారు. హోదాలో ఉండి చేసిన మేలు మరచిపోకండి! ఏ మానవుడైనా మానవత్వం వహించియున్న యిదే తరుణం తన త్యాగం, నిస్వార్థం రుజువు చేయటానికి. మా అమ్మ మీ ఇంటి సేవకురాలు. దాని రక్తం నీరుచేసి మీ యింటి బండెడు చాకిరీ చేసింది. మీపై ఒక చిన్న కీటకం వాలితే దానిపైనా పడాయి పడ్డట్టు భావించి మీ ఉపచర్యలు చేసేది. యీ నాడు మీరు తలుపు తీయరేం? డాక్టర్! డాక్టర్!! అంటూ 'వసంత' తలుపుకు తల బాదుకుంటూ యుంది.

ఆ యింటి ప్రక్క ఉన్న 'రామం' తొందరగా బయటకు వచ్చి 'వసంత' అవస్థచూసి నవ్వలేక జాలిపడి, 'వసంతా'!, 'వసంతా!' డాక్టరుగారు లేరమ్మా! నిన్నటి రాత్రి వెళ్ళిపోయారు అన్నాడు అతి దీనంగా!

ఆఁ! నిన్నటి రాత్రి!! ఎంతటి ఘోరరాత్రి. డాక్టర్! వెళ్ళిపోయారా? డాక్టర్! నారక్తాన్ని పీల్చి సంతృప్తిపడి పారిపోయావా? మీవంశానికి మా తల్లి గావించిన మహోపచారాలకు ప్రతిఫలంగా నన్ను మలినంచేసి మాయమయ్యావా? డాక్టర్ వయవంచనతో నన్ను నమ్మించి, కామించి తుదకు రమించి నా బ్రతుకు రచ్చకీడ్చి రహస్యంగా పలాయనం చిత్తగించావా? డాక్టర్! యిది మీకు ధర్మంగాదు. యిలాంటి దుష్కృత్యాలు మీబోటి గౌరవస్థులకు, పెద్దలకు అసమంజసం, అన్యాయం కూడా! డాక్టర్ యిది అక్రమం.

'వసంతా!', 'వసంతా!!' మీ అమ్మ చనిపోయింది' 'అంటూ యెవరో ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వస్తూయున్నారు. 'అమ్మా!' అంటూ 'వసంత' ఆ గుమ్మాన అలా కుప్పలా కూలబడిపోయింది.

× × ×

జనన మరణాలు లోకసహజం. మరణం అనగానే భీరువులకు భీతి. కానీ ఆ మరణం నేడో, రేపో, మాపో యేనాడో తప్పనిసరి. మరణం! దేనికా మరణం? దేనికీ మరణం లేదు భౌతిక దేహం నుండి జీవుడు దూరమవుతాడు. అంతే!

'డాక్టర్ సుందర్' మీలాంటి విజ్ఞానులు యిలా విచారిస్తే ఎలా? జరుగవలసింది జరిగి తీరుతుంది. మనం నిమిత్తమాత్రులం. యిక మీ తల్లిగారు దూరమయ్యారు; అని భావించేబదులు మీ కర్తవ్య నిర్వహణలో నిమగ్నులుకండి. లేవండి' అంటూ ఎవరో 'సుందర్'ని తట్టి లేపారు. జీవంలేని బొందెకం నానాహంగామాలు చేస్తారు. ఆ జీవుడు మాత్రం అప్పటికే యింకొక గర్భాన ప్రవేశించి ఉంటుంది. కానీ యీ నిర్జీవ కాయానికి ముక్తికని వెర్రి మొర్రి చేష్టలు చేసి తృప్తిపొందుతారు. ఆ కార్యనిర్వహణలో 'సుందర్' - 'వసంత' ను ఆమె తల్లిని మరచిపోయాడు. కనీసం ఒక కార్డుకూడా వ్రాయలేకపోయాడు. తాను 'వసంత'ను పెండ్లి చేసుకుంటాడు. దానికి ఉన్న ఒకే ఒక ప్రతిబంధకం అమ్మ! ఆ అమ్మ కూడా యీనాడు లేకుండా పోయింది. యికమీదట తనకు తానే సర్వం. అడ్డుచెప్పటానికీ, అధికారం చలాయించి ఆజ్ఞలు జారీచేయటానికీ తనకు యెవరూ లేరు, యిక 'వసంత' విషయంలోకూడా ఆమెకు మిగిలింది ఒకే తల్లి! పాపం ఆమె అతి పెద్ద దీనురాలు. తనకు ఆమె ఏనాడూ అభ్యంతరం చెప్పబోదు. యిక ఆ కళ్యాణ

శోభ యీ లోకులు యీ ఏడాదిలో కానీయరు. కారణం చావు మైల అంటారు. కాబట్టి యీ ఒక్క ఏడాది మాత్రం భగవంతుడు నిర్మించిన అడ్డుకాకపోయినా, మానవులు వికటాట్టహాసంతో కట్టిన అడ్డుగోడ! యిలాంటి ఆటంకాలు ఎన్ని అయినా ఒకే ఒక తృప్తి తానుమాత్రం 'వసంత'ను భార్యగా పొందగలుగుతాడు.

× × ×

పాపం 'వసంత' యిప్పుడు అనాథ! ఉన్న ఒక్క ఆశరా ఆ తల్లి మరణించింది. యిక ఆశపడ్డ 'సుందర్' తనకు చెప్పకుండా రాత్రికి రాత్రే పారిపోయాడు. అవును నిజానికి 'సుందర్' మోసకారియే! తనను నమ్మిక ద్రోహం చేశాడు. కాకపోతే ఒక్క ఉత్తరమయినా వ్రాయకపోదుడా? క్షణికోద్రేకాలకు గురియై ఒక అబల జీవితాన్ని నరకకూపంలో త్రోసివేశాడు. లోకవాదుకు బలిచేశాడు. యిప్పుడు 'వసంత'కు దారి ఏమిటి? అంటూ ఆమె ఒకమూల కూర్చుని తన భావి జీవితం గురించి తల పోసుకుంటూయుంది.

'వసంతా!', 'వసంతా!! అంటూ 'జానకిరామయ్య' ప్రవేశించాడు. వాడి ఆకారం, ఆకృతి భయంకరంగా కనబడుతూయుంది. అసలే పొగరుబోతు. ఆడదంటే అలుసుకాదని లోకం అంతా ఏకగ్రీవంగా తీర్పుచెప్పినా వాడి దృష్టిలో మాత్రం అబల అతి హీనం. దానికీ కారణాలు ఉన్నాయ్! పిత్రార్జితం యిల్లు, తాతలునాటి మాగాణి పొలాలు. యింకేం కావాలి? క్షణానికి ఒక సౌందర్య దేవత కావాలి!! వీడిలాంటి మదాంధులకు భగవంతుడే బుద్ధి చెప్పాలి!

ఆనాడు 'వసంత' తల్లి చాకిరీకని వీడి యింట్లో ప్రవేశిస్తే ఎంతో ఆదరంగా నియమించి తుదకు బలాత్కరించ బోయాడు. సమయానికి 'వసంత' తల్లిదగ్గరకు వెళ్ళబట్టీ ఆ క్షణాన ఆ పంద్రెండేండ్ల బాలిక యుక్తిగా చీపురుతో వాడిని చావ బాదబట్టీ ఆనాడు ఆ మహాసాధ్వి శీలం సంరక్షింపబడింది. వీడిపొగరు కాకపోతే యింటిలోని చాకిరీతోను, పాకీదానితోనూ, వంటమనిషితోనూ, తుదకు కక్కసులను కడిగేదానితోనూ వీడికి కామ లీలలా? అది వాడికి పట్టిన మైకంకాను. ధనం అనే గర్వం.

"వసంతా!" అంటూ "జానకిరామయ్య" తూలతూ ప్రవేశించాడు.

"ఏం బాబూ!" అంది ప్రత్యుత్తరంగా "వసంత!'

"బాబూ! ఏంటీ? ఏమండోయ్ శ్రీరామా...అనవే" అంటూ "వసంత" ప్రక్కనే కూర్చోటానికి ప్రయత్నిస్తూ యున్నాడు.

అయ్యా! ఏమిటీ అన్యాయం? "అగ్నిలో ఆజ్యం పోసేటట్టు" అసలే దుఃఖంముద్రాన మునిగి ఉంటే మీ యీరంపపు కోత దేనికి? మీ ఉద్దేశ్యం ఏమిటి?

"ఏమిటా! నీ యీ దుఃఖం దూరం చేయటానికి దేవుడే నన్ను పంపించాడు. రాత్రి కళలో మీ అమ్మ కనబడి "నాకుమార్తెను ఒక కంట చూడు బాబూ" అనగానే తెల్లారేసరికి రెక్కలు కట్టుకు వాలాను. అంతే! యిందులో దోషంలేదు." అంటూ" "వసంత" చేతిని "జానకిరామయ్య" పట్టబోయాడు.

"బాబూ!" అంటూ "వసంత" దూరంగా జరిగి పోయింది.

"ఏమిటే మహా బూబులాగ" అంటూ కౌగలించు బోయాడు. కామానికి కల్లులేవుగా!

"నీవు నవ్వితే చాలు నవరత్నాలు నీమెడ అలంకరిస్తాయ్! నీవు ఒక్కసారి కనుసైగ చేస్తే చాలు నీ యింటి చుట్టూ దాసదాసీలు హాజరవుతారు, నేను యెవరో తెలుసా?"

తెలుసు! నీవు మాతుబరిని కామ పిశాచివి. నీపట్ల ఉచ్ఛం, నీచం, మంచి, మర్యాదల్లేవు. నీకంటే ఆకసాయినయం. యికనైనా ఫో! లేదా నీపాపం పండిందనుకుని తెలుసుకోఫో! ఫో!! అంటూ "వసంత", "జానకిరామయ్య" ను బయటకు పంపే ప్రయత్నం చేసింది.

"హుం! నీకు ఇంతపొగరా! చూపిస్తా నాతడాకా', అంటూ "జానకిరామయ్య" కాళ్ళకు బుద్ధి చెప్పుకున్నాడు.

ఏడ్వావ్! నీ ధనానికి భ్రమసి, నీ కండబలానికి మురిసి నిన్ను చేరే చేలకాదు. "స్త్రీ" అంటే ఆదిశక్తి, ఆదిపరాశక్తి దాని ఉద్వేగం అతీతం జాగ్రత్త! కొండతో పోట్లాడి మట్టిలో పొర్లాడకముందే తెలివి తెచ్చుకో! జాగ్రత్త!!

లోగడ డాక్టర్ తన స్వంత ఊరు పేరు చెప్పినట్లు గుర్తు. అవును ఆదే పేరు, ఇక అక్కడకు పోవలసిందే! తన ప్రాణం, మానం రక్షించుకోవాలంటే అదే మార్గం "వసంత" ఆ అర్థరాత్రి చీకట్లో నడుచుకుంటూ పోతూయుంది. ఆపల్లె అంతా నిద్రాదేవి కౌగిలిలో సేదతీర్చుకుంటూయుంది. కుక్కలుమాత్రం అరుస్తూ ఉన్నాయ్! దూరంగా నక్కల కూతలు వినబడుతూ ఉన్నాయ్! అంతా నిశ్శబ్దం. ఏదో జోడెద్దులబండి మాత్రం ఏ ప్రక్కనుండో వస్తూయున్నట్లు అలజడి అవుతూయింది. బహుశా "జానకిరామయ్య" తన వాగ్దానం ప్రకారం వెంబడించుకుంటూ వస్తూయున్నాడా? అరె! ఎద్దుల మెడలకు కట్టిన మువ్వలు మ్రోత ఎక్కువ అవుతూయుందే! తను యిక పులినోట చిక్కిన జింక ఏం కాబోలు!! తన యీ ప్రయత్నం ఆ నరరూపరాక్షసికి యెవరు చెప్పి ఉంటారు? వేరు యితరులకు తెలియదు. వాడే నాగూపాపై ప్రతీకారంకోసం నిరీక్షిస్తూయున్నాడు. వాడికీ యితరత్రా పనిపాట్లు ఉంటేగా! యీ అఘాయిత్యం నుండి తప్పించుకునే ఉపాయం తోచటం లేదు. "ప్రభూ!" నీవేదిక్కు! ఓ సర్వేశ్వరా!! నా యీ దురవస్థా పీడితంనుండి విముక్తిరాలని చెయ్!! దుర్మార్గుడు నాదరి వేగంగా చేరటానికి కాబోలు ప్రక్కనుండి ఎద్దులను పాదుతూ అడ్డదారిగా వస్తూయున్నాడు. ఆపద్బాంధవా! అనాథరక్షకా!! నా మానాన్ని శీలాన్ని కాపాడే భారంనీదే! తిరిగి నాశీలం ఎంగిలి కాకుండా భద్రంచెయ్!" అంటూ "వసంత" పరుగు తీస్తూ ఉంది.

'వసంతా!' అంటూ ఎవరో వెంబడించుకుంటూ వస్తూయున్నారు.

'బాబోయ్! అంటూ 'వసంత'' పరుగు హెచ్చించింది. భగవాన్! అంటూ గుండె నిలువు చేసుకుంది. కానీ వెనుక వస్తూయున్న మానవాకారంకూడా పరుగు హెచ్చించింది.

'ఆగు! ఆగు!!'

'అమ్మా! అంటూ 'వసంత' ఆ చీకట్లో ఒక మ్రానుకు 'ఢీ' కొంది. రక్తం. అయినా ఫరవాలేదు. ఆ దుర్మార్గుడిచేత చిక్కకూడదు. ఆతరువాత లోకంలో వ్రేలెత్తి పొడిపించుకోకూడదు. ఆ నవ్వులాటకంటే యిదే మంచి పని' అంటూ తిరిగి పరుగు లంకించింది.

'ఆగు! 'వసంతా' ఆగు!! ఆ వ్యక్తి 'వసంత'ను తొందరగా చేరబోతూయున్నాడు.

చీకటి అధికం అవుతూయుంది. భగవన్నిర్మాణంలో ఏదీ ప్రబవించకపోతే పరిపక్వం కాదు. యిక తెల్లవారబోతూ ఉంది కాబట్టి చీకటి స్థాయి పెరుగుతూ ఉంది. ఆ చీకటిలో, భీతితో, కంగారులో 'వసంత' చెరువులో జారిపడింది. అసలే లోతైన చెరువు. ఆ వెనుక వస్తూయున్న వ్యక్తికూడా కంగారుతో 'వసంత'ను రక్షించే నిమిత్తం చెరువులో దూకాడు. కానీ 'వసంత' 'అభాగిని'. 'సుందర్' చేతిలోనే తుది ప్రాణం పోగొట్టుకుంది.

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.